క్లుప్తంగా

పశు గణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

వజ్రకరూరు: పశు గణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఎల్‌డీఏ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని రాగులపాడులో పశుసంవర్థక శాఖ– పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పశు కృత్రిమ గర్భాధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం నట్టల నివారణ కార్య క్రమం నిర్వహించారు. ఉప సర్పంచు రామాంజనేయులు, పశు వైద్యాధికారి క్రిష్ణమూర్తినాయక్, జేఈఓ భద్రునాయక్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఉరవకొండ: అభయ ఫౌండేషన్ సహకారంతో ఉరవకొండ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూపర్ 60 విద్యార్థులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ, భోజన వసతి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఉరవకొండ లయన్స్ క్లబ్ బిల్డింగ్‌లో ప్రారంభం అయిన శిక్షణ తరగతులను ఉద్దేశించి నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి నాగమల్లి ఓబుళేసు మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఏపీఆర్‌జేసీ, ర్జీటీ సెట్, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐఐటీలో సీట్లు సాధించేందుకు ఏర్పాటు చేసిన ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన 60 మందికి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించామన్నారు. నెల రోజుల పాటు అనువజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉచిత శిక్షణ ఇస్తామని, శిక్షణ కాలంలో భోజన వసతి కూడా కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు లయన్స్ అధ్యక్షులు సప్తగిరి మల్లి, లక్ష్మీనారాయణ చేతుల మీదుగా స్టడీ కిట్లను అందించారు.

సర్పంచ్ గారూ.. దాహార్తి తీర్చండి



శెట్టూరు మండల కేంద్రంలో నీటి కోసం కొళాయి వద్ద వేచి ఉన్న మహిళలు

శెట్టూరు: నెల రోజులుగా మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో నీటి ఎద్దడి నెలకొంది. రోజుకు రెండు, మూడు బిందెల నీళ్లు మాత్రమే వస్తున్నాయని, ఒకరికి నీళ్లు దొరికితే.. నలుగురు వెనక్కు వెళ్లాలన్నారు. స్థానిక సర్పంచ్ కుమార్, పంచాయతీ అధికారులకు పలుమార్లు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామంలో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాపై సర్పంచ్, పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మహిళలు మండిపడ్డారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే తమ సమస్యలు ఎవరు తీరుస్తారంటు తమగోడును మీడియా ముందు పంచుకున్నారు. ఇప్పటికైనా స్థానిక సర్పంచ్, అధికారులు పట్టించుకోవాలని వారు కోరారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలి



మాట్లాడుతున్న కాపు భారతి

రాయదుర్గం: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావబంబన దిశగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. సోమవారం డి హీరేహాళ్ మండలకేంద్రంలోని వైకేపీ కార్యాలయం లో డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలంతా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, వైకేపీ ఏసీ గంగాధర, ఏపీఎం శివప్రసాద్, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తోనే బంగారు భవిష్యత్

- 15 రోజుల్లోనే 79 లక్షల మిస్డ్‌కాల్స్‌తో ప్రజాదరణ
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



రాయదుర్గం: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: బ్రోచర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

రాయదుర్గం: జగనన్నే మా నమ్మకం కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, 15 రోజుల వ్యవధిలోనే 79 లక్షల మంది మిస్ట్ కాల్స్ నమోదు చేసుకోవడమే ఇందుకు నిదర్శనమంటూ రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, జెడ్పీటీసీ మహేష్‌తో కలసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ ఉంటేనే మా సంక్షేమం, బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని ఇంటింటా ప్రజలు గట్టిగ నమ్ముతున్నారన్నారు. సీఎంగా జగన్ ఉన్నంత వరకే అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, జగనన్న తోడు, చేదోడు, విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్, విదేశీవిద్య, విద్యాకానుక, సున్నావడ్డీ, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అందుతాయనేది ప్రజలకు నమ్మకమన్నారు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్షతకు తావులేకుండా డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.2 లక్షల కోట్లు చేర్చిన ఘనత సీం జగన్‌కు దక్కుతుందన్నారు.

టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారు..

వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని విప్ ధ్వజమెత్తారు. సామరస్యంగా ఉండే పల్లెల్లో రాజకీయ స్వార్థం కోసం ఉగ్ర వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, కుమారుడు లోకేష్‌కు భవిష్యత్ లేదన్నారు. ప్రజలు టీడీపీని ఏమాత్రం విశ్వసించడం లేదన్నారు. ఈ కారణంగా 2024 ఎన్నికలే బాబు, పప్పు, రాయదుర్గంలో మురికి కాలువకు ఆఖరివి కానున్నాయన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జిల్లాలోని నార్పలలో పర్యటిస్తారని విప్ కాపు వివరించారు. జగనన్న వసతిదీవెనకు సంబంధించిన డబ్బును ఇక్కడి నుంచే బటన్‌నొక్కి అర్హులకు జమచేస్తారన్నారు. నియోజకవర్గంలోని పట్టణం, అన్నీ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ బోయ మంజునాథ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన

ఉరవకొండ: ప్రభుత్వ పనితీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మెగా సర్వే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం మొదలై 15 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన సర్వే ఎలా సాగిందో వారితో చర్చించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 15 రోజుల్లోనే జగనన్నే మా భవిష్యత్ పేరుతో కోటి కుటుంబాలను కలసి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం దేశంలోనే ఓ రికార్డు అన్నారు. నియోజకవర్గంలో 89 వేల కుటుంబాలకు గాను ఇప్పటికే 59 వేల కుటుంబాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిశారన్నారు. ప్రతి గడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తూ స్టిక్కర్లు ఇంటికి వేసుకున్నారన్నారు. 85 శాతం ప్రజలు జగనన్నే మా భవిష్యత్ అంటున్నారన్నారు. దుష్ట చతుష్టయం ఎన్ని ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేసినా చంద్రబాబును నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. మరోవైపు టైమ్స్‌నౌ సర్వే వాస్తవ పరిస్థితులను అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల జేసీఎస్ కన్వీనర్లు తేజోనాథ్, ఆసిఫ్, భరత్‌రెడ్డి, దుద్దేకుంట రామాంజనేయులు, రాట్నిగౌడ్, జల్లిపల్లి దేవేంద్ర, మండల కన్వీనర్లు బ్యాంకు ఓబుళేసు, బసన్న, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, నాయకులు బసవరాజు, జోగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు అనంతపురం పట్టణంలోని బళ్లారి రోడ్డులో టీసీపీసీ సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతులకు ట్రై స్కూటర్స్ పంపిణీ చేయి కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల యానిమేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

పాల వ్యాను బోల్తా

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి సమీపంలో పెన్నానది వంతెన వద్ద పాల ప్యాకెట్లను తీసుకువెళ్లే వ్యాన్ సోమవారం బోల్తా పడింది. పాల ప్యాకెట్లను గమ్యస్థానాలకు చేర్చిన అనంతరం అనంతపురం వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో పాటు వంతెన వద్ద ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వంతెన వద్ద అధిక వేగంతో వెళ్లడమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

నేడు ఆదిశంకరాచార్యుల జయంతి

కళ్యాణదుర్గం: స్థానిక కోట వీధిలో ఉన్న శృంగేరి శంకరమఠంలో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు శృంగేరి శంకర మఠం కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం మఠం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, గురుపూజ, రుద్రహోమము, మహామంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జగద్గురు చిత్రపటంతో గ్రామోత్సవం జరగనుంది.

క్రీస్తు సందేశాన్ని విస్తృత పరచాలి

కళ్యాణదుర్గం: క్రీస్తు సందేశాలను మరింత విస్తృత పరచాలని బెంగుళూరుకు చెందిన సెలోన్ అండ్ ఇండియా జనరల్ మిషన్ చైర్మన్ రెవరెండ్ త్యాగరాజన్ అన్నారు. స్థానిక సీఅండ్ఐజీఎం చర్చిలో సోమవారం చర్చి కాపరుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘ కాపరులు స్వార్థాన్ని వీడాలన్నారు. క్రీస్తు మార్గంలో నడుస్తూ బోధనలు చేయాలన్నారు. క్రీస్తు సందేశాలిస్తూ నిస్వార్థంగా పనిచేసినప్పుడే సంఘ కాపరులకు సార్థకత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, సహనం, ఓర్పు, స్నేహంతో మెలగాలన్నారు. అంతకు ముందు సంఘ కాపరి డీఎస్ పాల్ ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ ఐజయ్య, సెక్రటరీ బెంజిమెన్ తిమోతి, కోశాధికారి గిద్యోను, చర్చి పెద్దలు రాజశేఖర్ చౌదరి, కార్యదర్శి రోజ్లీ రాజేష్, ఆర్థర్ బాబు, లీగల్ అడ్వైజర్ మనోజ్‌కుమార్, చర్చి ట్రెజరర్ జోసెఫ్ కిశోర్, సునీల్ కుమార్, జ్ఞానసుందర్, బంగ్లా ప్రసాద్, ప్రశాంత్, విల్సన్, డానియేల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతులకు నూతన సాంకేతికత అందించాలి

కళ్యాణదుర్గం: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతికను అందించాలని కళ్యాణదుర్గం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి సూచించారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో సోమవారం కేవీకే సహకారంతో ఎస్‌వీబీఆర్ అగ్రికల్చర్ కళాశాల ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కో ఆర్డినేటర్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా విద్యార్థులు గ్రామంలో ఉంటూ వ్యవసాయ పనితీరును గమనించారన్నారు. రైతుల అవలంబిస్తున్న వ్యవసాయ పద్ధతులు, వాడుతున్న పనిముట్లు, సాంకేతికతపై విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకున్నారన్నారు. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అనంతరం ఏడీఏ యల్లప్ప మాట్లాడుతూ రైతులు పరిశోధన విద్యార్థులకు వ్యవసాయంపై పరిజ్ఞానం అందించడంలో గురువులాంటి వారన్నారు. విస్తరణ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ , సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ యుగంధర్, డాక్టర్ హరిణి, ఉప సర్పంచు గోవిందరాజులు, రైతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



బొమ్మనహాళ్: జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సర్పంచ్‌లు పరమేశ్వర, ఆర్.శకుంతలమ్మ



కళ్యాణదుర్గం: అవార్డు అందుకుంటున్న పాలవాయి సర్పంచు నాగరత్నమ్మ

కళ్యాణదుర్గం/కుందుర్పి/బ్రహ్మసముద్రం/కంబదూరు/శెట్టూరు/రాయదుర్గంరూరల్/బొమ్మనహాళ్/కణేకల్లు/గుమ్మఘట్ట/వజ్రకరూరు: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం పంచాయితీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదరికం లేని గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలహిత గ్రామం, నీటి సమృద్ధి గల గ్రామం, పరిశుభ్రమైన హరిత గ్రామం, స్వయం సమృద్ధి ఉన్న మౌళిక సదుపాయాలు గ్రామం, సామాజిక సురక్షితమైన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, లింగ సమానత్వంలో మరింతగా గ్రామాభివృద్ధి అనే అంశాలపై ఆయా గ్రామ పంచాయితీలకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. ఆయా అవార్డులను అధికారులు సర్పంచులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కణేకల్లు: జక్కలవడికి సర్పంచు శారదమ్మకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న అధికారులు



బ్రహ్మసముద్రం: అవార్డు అందుకున్న సర్పంచులతో అధికారులు



వజ్రకరూరు: అవార్డులు అందుకున్న సర్పంచులతో ఎంపీపీ రమావత్‌దేవి,అధికారులు

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'



కౌకుంట్ల పంచాయితీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్/బెళుగుప్ప/వజ్రకరూరు: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయితీ కౌకుంట్లలో సోమవారం గ్రామ సచివాలయ రూరల్ కన్వీనర్లు చనమలరెడ్డి, ఎం.ఎర్రిస్వామి, కృష్ణ, రామాంజి ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. కౌకుంట్ల పంచాయితీలో ఎక్కడా పార్టీలు, కుల మతాలు చూడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వై.రాంపురం, రేణమాకులపల్లి, లత్తవరం, లత్తవరంతాండా, బూదగవి, నింబగల్లు, రాయంపల్లి తదితర గ్రామాల్లో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం జోరుగా సాగింది. బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వన్నూర్‌సాబ్, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు, అనితమ్మ, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి, రఘురాములు పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంధిలోని తట్రకల్లు గ్రామంలో చేపట్టిన జగనన్నే మాభ భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరభద్రగౌడ్, స్థానిక నాయకులు బసవరాజు, నాగేంద్ర, సూరప్ప, ఇబ్రాయిల్, జగదీష్, ఎంపీటీసీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

శెట్టూరు: మండలంలోని వివిధ మద్యం కేసుల్లో పట్టుబడ్డ 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు. సెబ్ అధికారులతో కలసి ఈ నెల 26న స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.3,000 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

కలుషిత నీరు తాగి మేకల మృతి

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో సోమవారం ఉదయం యూరియా కలిపిన నీరు తాగి ఆరు మేకల మృతి చెందాయి. రైతు చంద్రన్న తనకున్న పది మేకలను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో యూరియా కలిపిన కలుషిత నీటిని మేకలు తాగాయి. గమనించిన రైతు చంద్రన్న మిగిలిన మేకలను పక్కకు తీసుకెళ్లాడు. కలుషిత నీరు తాగిన ఆరు మేకలు గంటల వ్యవధిలోనే మృతి చెందాయి. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయాడు.

హరిశ్చంద్ర ఘాట్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: స్థానిక ఉరవకొండ–చాబాల రోడ్డులో ఆర్యవైశ్య హరిశ్చంద్ర ఘాట్(శ్మశానం) ప్రహరీ, ఆర్చ్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డితో కలిసి అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య హాజరయ్యారు. రూ.15లక్షల ఎంపీ నిధులతో పనులను చేపట్టడంతో ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే, ఎంపీని ఘనంగా సత్కరించారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయింపుతో పాటు ప్రహరీ నిర్మాణానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్, పంచాయతీరాజ్ విభాగాల జిల్లా అధ్యక్షులు వీరన్న, బసవరాజు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పీఆర్ డీఈ హరికృష్ణ, ఈఓ గౌస్‌సాహెబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తిరుపాల్‌శెట్టి, బూశెట్టి రమేష్, చిత్రాల కామిశెట్టి, నరేంద్ర, చెల్లూరు నాగరాజు, కొంజేటి సురేష్, బద్రి, కరూర్ జగదీష్, కల్లూరు జగదీష్, భాస్కర్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు వరం 'సీఎం సహాయనిధి'



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గుమ్మఘట్ట మండలంలోని దేవరెడ్డిపల్లికి చెందిన వేదావతి అనే బాధితురాలికి రూ.60 వేలు విలువచేసే సీఎం సహాయనిధి చెక్కును సోమవారం పట్టణంలోని తన కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. పేదలను అన్నీ విధాల ఆదుకునేలా సీఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రూ.వెయ్యి దాటితే చాలు ఆరోగ్య శ్రీ ద్వారా ఖరీదైన వైద్యం అందిస్తూ, ఆ పరిధిలోకి రాని వారిని సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాయదుర్గం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్ కాపు రామంద్రారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలీబాషాతో కలసి ఉద్యోగులకు తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ రామమూర్తి, మేనేజర్ కిశోర్, సిబ్బంది, జెడ్పీటీసీ మహేష్, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, గౌని లావణ్య, శారద, ఐనాపురం మంజునాథ, వార్డు ఇన్‌చార్జు దివాకర్ పాల్గొన్నారు.

బీమా ఎన్‌రోల్‌మెంట్ చేయలేదని ధర్నా



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన ఆటో డ్రవర్ తిమ్మప్ప(40) ఈ నెల 23న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు విషయాన్ని వలంటీర్‌కు చెప్పినా వైఎస్సార్ బీమా కింద ఎన్‌రోల్‌మెంట్ చేయలేదు. వైఎస్సార్ బీమా వర్తించకుండా నిర్లక్ష్యం చేసిన వలంటీరు, అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వైకుంఠ రథంలో తిమ్మప్ప మృతుదేహంతో వచ్చి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీఓ చంద్రమౌళి, అర్బన్ సీఐ హరినాథ్, ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి దహన సంస్కారాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి ఆస్పత్రిలో మృతుడి తల్లి గౌరమ్మకు రూ.10 వేలను వైస్ ఎంపీపీ నరసింహులు, ఉపసర్పంచ్ వన్నప్పల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, నాయకులు వడ్డే ఆంజినేయులు, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణసాయం అందజేత

కంబదూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన హనుమంతరాయుడు (32) అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేల నగదును మృతుడి భార్య శిరీషకు సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప, ఎంపీటీసీ మల్లేష్ అందజేశారు. నాయకులు మల్లూరి వెంకటేశులు, రామస్వామి, వార్డు మెంబర్ రాజు, శివప్రసాద్, మల్లికార్జున, హనుమంతరాయుడు, కిరణ్, రామస్వామి, చెన్నకేశవులు, రామాంజి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివలింగప్ప పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో రైతు ఆరెళ్ల నాగరాజు(42) అప్పుల భారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. నాగరాజు 4.38 ఎకరాల సొంత పొలంతో పాటు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. పంట పెట్టుబడుల కోసం రూ.15 లక్షల దాకా అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం కానరాక ఆదివారం గ్రామానికి సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

డి హీరేహాళ్(రాయదుర్గం): సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం డి హీరేహాళ్ మండలం చెర్లోపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ నాలుగేళ్లల్లో ప్రతి కుటుంబం పొందిన లబ్ధిపై తయారుచేసిన ప్రత్యేక బుక్‌లెట్‌ను విప్ కా అందజేసి సంక్షేమం, అభివృద్ధి పై వివరిస్తుండగా పేదలంతా జగన్ కే జైకొట్టారు. విప్ మాట్లాడుతూ టీడీపీ మూకలు ఎన్ని డ్రామాలు చేసినా వారి మోసాలు, పాపాలను ప్రజలు మరచిపోవడం లేదన్నారు. జన్మభూమి కమిటీలు, నీరు–చెట్టు పేరుతో ఊరురా దోపిడీకి టీడీపీ నాయకులు పాల్పడితే, ప్రతి పైసా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చుచేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. రాష్ట్రంలో బాబు, రాయదుర్గం లో కాలువ ను ప్రజలు చిత్తుగా ఓడించడం ఖయమన్నారు. అధికారంలో ఉన్ననాళ్లు దోపిడీకి పాల్పడి, నేడు సెల్ఫీల డ్రామ ఆడితే ఎవరూ నమ్మరని ధ్వజమెత్తారు. ప్రతి సెల్ఫీకి కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కల్యం సురేష్, సురేష్‌యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.